క్లుప్తంగా

కొత్త అధికారులకు ఆత్మీయ సత్కారం



ఏఈఈ శైలజను సత్కరిస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

మధురవాడ: కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఇద్దరు ప్రభుత్వాధికారులను మధురవాడ పౌర సంక్షేమ సంఘం నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ సత్కారం చేశారు. మధురవాడ జీవీఎంసీ జోన్–2 కమిషనర్ పి.సింహాచలం, ట్రాన్స్‌కో మధురవాడ ఏఈఈ ఎ.శైలజలకు సంఘ అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు బెల్లాపు పాపారావు, శ్రీపాద వెంకటరమణ, జగన్మోహన్ చౌదరి, డాక్టర్ బి.ఎస్.రావు, వంటాకుల శ్రీనివాసరావు, ఆశా స్వరూప్, ఆశాలత, దువ్వి కావ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల్లో విజేతలకు అభినందనలు



తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తగరపువలస: గత నెల 23 నుంచి 25 వరకు చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను సోమవారం తాటితూరు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు అభినందించారు. తమ విద్యార్థులు షాట్‌పుట్‌లో మొదటి బహుమతి, ఖోఖోలో రెండో బహుమతి సాధించినట్టు హెచ్ఎం మురళి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు వ్యాయామ ఉపాధ్యాయుడికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాదరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీస్ శిక్షణ కేంద్రంలో వార్షిక తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ మురళీకృష్ణ

పీఎం పాలెం: రికార్డుల నిర్వహణలో అలసత్వం లేకుండా అప్‌డేట్‌గా ఉండాలని 16వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ కె.వి.మురళీకృష్ణ సూచించారు. బక్కన్నపాలెంలోని ఏపీఎస్‌పీ పోలీస్ శిక్షణ కేంద్రంలో సోమవారం వార్షిక తనిఖీ చేశారు. కేంద్రం నిర్వహణలో అన్ని విభాగాలను పరిశీలించారు. ఆయన వెంట బెటాలియన్ అదనపు కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభ రాజు, అసిస్టెంట్ కమాండెట్లు పి.దేవానందరావు, పి.సత్యం, వి.నారాయణ తదితర అధికారులున్నారు.

తైక్వాండో రాష్ట్ర స్థాయి పోటీలకు పద్మనాభం విద్యార్థిని



లావణ్య

పద్మనాభం: పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆరో తరగతి విద్యార్థిని ఎం.లావణ్య రాష్ట్ర స్థాయి అండర్–14 తైక్వాండో పోటీలకు ఎంపికైంది. విశాఖ ఆంధ్రా యూనివర్సిటీలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో లావణ్య ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి పోటీలకు అర్హత సాధించింది. తిరుపతిలో ఈ నెల 6 నుంచి 8 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో లావణ్య పాల్గొంటుంది. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

బీర సాగుకు వాన దెబ్బ

- తర్లువాడ పంచాయతీలో విస్తారంగా సాగు
- ఇటీవల వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్న పంట
- పెట్టుబడిలో 3వ వంతు కూడా రాని ఆదాయం
- తీవ్ర నష్టాలతో బావురుమంటున్న రైతులు



ఎత్తు భూముల్లో వర్షాల నుంచి బయటపడి పండిన బీరకాయలతో రైతులు



పాదుకు కుళ్లిన, మురిగిపోయిన బీరకాయలు



తర్లువాడలో దిగుబడి లేక బోసిగా మిగిలిన బీర పాదులు

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలోనే ఆనందపురం మండలం తర్లువాడ పంచాయతీకి బీర సాగులో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఈ పంచాయతీలో 90 శాతం మందికి పైగా బీర సాగుపై ఆధారపడి జీవిస్తున్నారు. ఒక్కో ఇంటికి చెందిన రైతులు కనీసం 50 సెంట్ల నుంచి గరిష్టంగా ఎకరాలలో బీర సాగుకు ప్రాధాన్యమిస్తారు. వీరి ప్రధాన పంట బీర కాగా.. తరువాత స్థానాల్లో బొప్పాయి, ఎర్ర దుంపలు, వరి, కనకాంబరం, క్యారెట్, ముల్లంగి, వంకాయ, ఆకుకూరలు, మొక్కజొన్నలు ఉంటాయి. ఏటా ఇక్కడి రైతులకు సిరులు కురిపించే బీర ఈ సారి ఆగస్టు, సెప్టెంబర్‌ల్లో కురిసిన వర్షాల కారణంగా కన్నీళ్లు పెట్టించింది. బీర సాగులో ఉన్న 80 శాతం మందికి నష్టాలను చవి చూపించాయి. చెరువులను ఆనుకుని, పల్లపు భూముల్లో రోజుల తరబడి నిలిచిన వర్షపు నీరు కారణంగా ఎర్రతెగులు సోకి ఆకులు తెల్లగా మారిపోయాయి. పాదులకే పిందెలు కుళ్లిపోవడం, ఎదుగుదల లేక వాడిపోవడంతో బీర రైతులు బావురుమంటున్నారు. అడుగు మేరకు పైగా పెరిగే బీరకాయలు జానెడు సైజుకు పడిపోయాయి. దీంతో ఈ సీజన్ తమకు తీవ్రంగా నష్టాలు మిగిల్చినట్టు మజ్జి నరసింగరావు అనే రైతు వాపోయాడు.

ఎకరానికి రూ.30 వేల వరకు ఖర్చు

ఇక్కడి రైతులు బీర సాగుకు ప్రధానంగా కొండ కర్రను వినియోగిస్తుంటారు. దగ్గరలోని కొండలపై కర్రలను కొట్టి తెచ్చి నిలువునా పాతి వీటికి బీరపాదులను ఎక్కిస్తుంటారు. ఈ కర్ర తెచ్చి పాతడానికే అన్ని ఖర్చులు కలిపి ఎకరాకు రూ.20 వేల వరకు ఖర్చు చేస్తారు. సొంతంగా కట్టి ఉంచిన విత్తనాలను జూన్ చివరలో పెడితే సెప్టెంబర్ మొదటి వారంలో దిగుబడి ప్రారంభించి నాలుగు నెలలు ఉంటుంది. దుక్కి సమయంలో పశువుల గెత్తం, డీఏపీ, యూరియా, వేపపిండి, పొటాష్‌లకు గాను మరో రూ.10 వేలు ఖర్చవుతుంది. ఈ సీజన్‌లో 60 బాక్సుల వరకు దిగుబడి వస్తుంది. 35 కిలోల



వర్షాలకు గిడసబారిన బొప్పాయిలు

ఒక్కో బాక్సు ధర హోల్‌సేల్ మార్కెట్‌లో రూ.1,000 నుంచి డిమాండ్‌ను బట్టి రూ.1,800 వరకు వెళ్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో వినియోగదారుడికి కిలో రూ.40 నుంచి రూ.50 మధ్యలో లభిస్తుంది. ఒక్కోసారి బీర ధర రూ.80 వరకు చేరుకుంటుంది. పేషెంట్లకు పత్యంగా మటన్ తరువాత ఎక్కువగా సిఫారసు చేసేది బీరకాయనే. పంట చేతికొచ్చే వేళ.. వర్షాల కారణంగా పెట్టుబడిలో 3వ వంతు కూడా ఆదాయం రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లీజుకు తీసుకుని సాగు చేస్తున్నా..



ఎకరా భూమిని లీజుకు తీసుకుని బీర సాగు చేస్తున్నాను. ఇప్పటి వరకు రూ.25 వేలు ఖర్చు చేశాను. వరుస వర్షాల కారణంగా దిగుబడి ప్రారంభం కాకుండానే పంట పోయింది.

– బాలి అప్పలనాయుడు, రైతు, తర్లువాడ

60 సెంట్ల పంట నష్టం



ఈ ఏడాది 60 సెంట్లలో బీర వేశాను. మేమే సొంతంగా ఏటా విత్తనాలు కట్టిస్తాం. మిగిలిన విత్తనాలు స్టోర్‌ల్లో విక్రయిస్తాంటాం. వర్షం కారణంగా పంట మొత్తం పోయింది.

– కోరాడ కన్నయ్య, రైతు, తర్లువాడ

కొద్ది మంది బయట పడ్డారు



కొంచెం ఎత్తు ప్రాంతాల్లో భూములు ఉండి సాగు చేసుకుంటున్న రైతులు వర్షాల బారి నుంచి బయట పడ్డారు. వారికి వచ్చే అరకొర దిగుబడితో కొంత సొమ్ము చేసుకుంటున్నారు.

– తాత్రాజు అప్పారావు, రైతు, తర్లువాడ

ఈ సారే దొరికిపోయాం



మా పంచాయతీలో బీర పంట సాగు రైతులందరికీ ఎప్పుడూ లాభాలే ఇచ్చేది. వర్షాల కారణంగానే ఈ సారి దొరికిపోయాం. కేవలం బీర కాకుండా బొప్పాయి పంటలో కూడా నీరు నిలిచి కాయలు కుళ్లిపోయాయి.

– కోరాడ కృష్ణ, రైతు, తర్లువాడ

12 మంది మందుబాబులకు జరిమానా

- ఒకరికి మూడు రోజుల జైలు శిక్ష

పీఎం పాలెం: మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన మందుబాబులకు న్యాయ స్థానం రూ.1.20 లక్షల జరిమానా విధించింది. ఒకరికి మూడు రోజుల పాటు జైలు శిక్ష వేసింది. పీఎం పాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాలిలా.. స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిపై ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి ద్విచక్రవాహనం నడుపుతున్న 13 మందిపై కేసులు నమోదు చేసారు. వారిని కోర్టులో హాజరు పరచగా.. 12 మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేల వంతున రూ.1.20 లక్షల జరిమానా, బి.వెంకటరమణ అనే వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష న్యాయ స్థానం విధించినట్లు ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.

రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు



వ్యాపారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ

సాక్షి ఎఫెక్ట్..

కొమ్మాది: రుషికొండ వద్ద ప్రధాన రహదారిపై వాహనాలు పార్క్ చేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ సమస్యపై సోమవారం 'ప్రధాన రహదారిపైనే వాహనాల పార్కింగ్' అనే శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి ఆరిలోవ ట్రాఫిక్ సీఐ ప్రసాద్ స్పందించారు. వ్యాపారులతో ఆయన మాట్లాడి ఇక్కడ రహదారిపై పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇకపై ఎవరైనా ద్విచక్ర వాహనం లేక కార్లను రోడ్డుపైనే పార్కింగ్ చేసినట్లయితే వ్యాపారులతో పాటు వాహనదారుల పైన కూడా కేసు నమోదు చేస్తామని తెలిపారు.

తీరంలో 'స్వచ్ఛతా హీ సేవా'



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీ ప్రేమ ప్రసన్నవాణి, ఐఎన్ఎస్ కళింగ సిబ్బంది

కొమ్మాది: జీవీఎంసీ జోన్–1 కమిషనర్ పి.ప్రేమ ప్రసన్నవాణి, ఐఎన్ఎస్ కళింగ ఆధ్వర్యంలో సోమవారం భీమిలి బీచ్ రోడ్డు ఐఎన్ఎస్ కళింగ సమీపంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ సిబ్బంది, నేవీ ఉద్యోగులు కలిసి బీచ్ ఒడ్డున పేరుకుపోయిన వ్యర్థాలు, పాలిథిన్ కవర్లను తొలగించి శుభ్రం చేశారు.

అన్ని వసతులతో అంగన్‌వాడీ కేంద్రాలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు

తగరపువలస: బాల్యారంభ దశ సంరక్షణ విద్య, పోషణ వాటిక, ఎల్ఈడీ టీవీ, మంచినీటి శుద్ధికరణ యంత్రం, చిన్నారుల మానసిక, శారీరక భావాత్మక అభివృద్ధి పెయింటింగ్స్, ఫర్నిచర్ వంటి వసతులతో అంగన్‌వాడీ కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ రీజనల్ డైరెక్టర్ వి.చిన్మయిదేవి తెలిపారు. భీమిలి మండలం చిప్పాడలో సాక్షం అంగన్‌డీ కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఇలాంటి అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభించగా.. భీమిలి ప్రాజెక్ట్ పరిధిలో 22 కేంద్రాలు మంజూరయ్యాయన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, బాలలకు అన్నప్రాసన, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించారు. సర్పంచ్ వెంపాడ రమావతి, ఎంపీటీసీ సభ్యురాలు చుక్క ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటప్పడు, మాజీ సభ్యుడు అప్పారావు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి, ఐసీడీఎస్ భీమిలి పీవో ఎం.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రెండో సెమిస్టర్ పుస్తకాలు అందించాలి



బంగ్లామెట్ట పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న భీమిలి ఎంఈవో శివరాణి

తగరపువలస: ప్రతి పాఠశాలలో రెండో సెమిస్టర్ పుస్తకాలను విద్యార్థులకు వెంటనే అందించాలని భీమిలి ఎంఈవో శివరాణి సూచించారు. బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆమె తనిఖీ చేశారు. టీచర్ల డైరీలు, టీచింగ్ నోట్స్, పాఠ్య ప్రణాళికలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రతి రికార్డు అప్‌డేట్‌గా ఉండాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచాలని సూచించారు. హాజరు వేసిన తరువాత విద్యార్థి బయటకు వెళ్లకుండా చూడాలని, అవసరమైతే తల్లితండ్రుల అనుమతితో పంపించాలన్నారు. స్కూల్ కమిటీ చైర్మన్ షేక్ షర్మిల, హెచ్ఎం రెడ్డిపల్లి అప్పలరాజు, ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, ఈగల సంజీవి తదితరులు పాల్గొన్నారు.

మాకూ సమాచారం ఇవ్వాల్సిందే..

- జనసేన వార్డు అధ్యక్షుల హుకుం



జోనల్ కమిషనర్ సింహాచలంతో మాట్లాడుతున్న జనసేన నాయకులు

మధురవాడ: తామూ ప్రభుత్వ భాగస్వాములమేనని, ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం తమకూ ఇవ్వాల్సిందేని 5, 6, 7 వార్డులకు చెందిన జనసేన పార్టీ వార్డు అధ్యక్షులు దేవర శివ, సంతోష్ నాయుడు, నాగోతి నర్సింహనాయుడులు హుకుం జారీ చేశారు. మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం జోన్–2 కమిషనర్ పి.సింహాచలంను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఇకపై తప్పకుండా అన్ని విభాగాల నుంచి సమాచారం వచ్చేలా చర్యలు చేపడతామని జెడ్సీ హామీ ఇచ్చారు.

కొత్తమ్మతల్లికి ప్రత్యేక అలంకరణ



తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతపేట కొత్తమ్మతల్లిని సోమవారం రాత్రి ఆలయ కమిటీ ప్రతినిధులు తులసిమాలలు, కనకాంబరాలు, జాజులతో అలంకరించారు. ఆదర్శనగర్‌కు చెందిన పట్నాల రాము, ఎల్లయ్యమ్మ దంపతులు ఈ అలంకరణతోపాటు మంగళవారం ప్రసాదాల పంపిణీకి సహాయ సహకారాలు అందించారు. మేకల జానకి, పినిశెట్టి రమణమ్మ అమ్మవారి అలంకరణను పూర్తి చేశారు.

ప్రైవేట్ స్కూళ్ల భీమిలి కన్వీనర్‌గా బోగెల కృష్ణ



తగరపువలస: ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అండ్ ఎయిడెడ్ స్కూళ్ల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ భీమిలి కన్వీనర్‌గా స్థానిక సాయి రవీంద్ర పాఠశాల కరస్పాండెంట్ బోగెల కృష్ణ నియమితుడయ్యారు. ఇటీవల ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జరిగిన అసోసియేషన్ మీటింగ్‌లో ఈ పదవి లభించింది. ఇప్పటి వరకు భీమిలి కార్యదర్శిగా పని చేసిన బోగెలను భీమిలికి చెందిన ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలు సోమవారం అభినందించాయి.

కారు బీభత్సం ఘటనపై కేసు నమోదు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు కె.నగరపాలెం దరి గోవుపేట వద్ద ఆదివారం రాత్రి జరిగిన కారు బీభత్సం ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుధాకర్ తెలిపారు. మీసాల వెంకట్ అనే వ్యక్తి మద్యం తాగి వాల్వో కారు అతి వేగంగా నడపడం వల్ల ఈ ప్రమాదం సంభవించిందన్నారు. ప్రస్తుతం సీసీ కెమెరాల ఆధారాలు పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పోస్టల్ ఉద్యోగిపై దాడి

పద్మనాభం: మండలంలోని పెంటలో ఆదివారం రాత్రి పోస్టల్ ఉద్యోగిపై జరిగిన దాడి ఘటనపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా.. పాత కొవ్వాడ గ్రామానికి చెందిన పోస్టల్ ఉద్యోగి తమటపు నారాయణమూర్తి ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై పెంట మీదుగా వెళుతున్నాడు. పెంటలో ఇదే గ్రామానికి చెందిన దేవరపల్లి పైడిరాజు కత్తితో దాడి చేసి నారాయణమూర్తిని తలపై కొట్టి గాయపరిచాడు. పైడిరాజును బోని చంద్రశేఖర్, దేవరపల్లి గణేష్ పోత్సహించినట్టు పోలీసులు తెలిపారు. నారాయణమూర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

కేంద్ర బృందం విస్తృత పర్యటన



ఐనాడ సచివాలయం వద్ద కేంద్ర బృంద సభ్యులతో అధికారులు

పద్మనాభం: గ్రామీణ ప్రాంత ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర బృంద సభ్యులు అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోలకర్ అన్నారు. మండలంలోని ఐనాడ, కోరాడ గ్రామాల్లో సోమవారం వారు పర్యటించి కేంద్ర పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గైక్వాడ్, నింబోలకర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద రైతులకు ఉద్యాన వన తోటలు పెంచుకోవడానికి ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, కాలనీ ఇళ్లు, ఉద్యాన వన తోటలను వారు పరిశీలించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులతో ముఖాముఖి నిర్వహించారు. సంఘాల నిర్వహణ తీరు, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు ఏ మేరకు సద్వినియోగం చేసుకుంటున్నారో స్వయం సహాయక సంఘాల సభ్యులు అడిగి తెలుసుకున్నారు. ఐనాడలో ఉపాధి హామీ పథకం ద్వారా చాకలి చెరువు గట్టుపై వేసిన కొబ్బరి మొక్కలు, యాతపేట రోడ్డు కిరువైపులా నాటిన మొక్కలను, కోరాడలో అర ఎకరంలో వేసిన డ్రాగన్ ఫ్రూట్స్ తోటను పరిశీలించారు. వీరి వెంట డీపీఎం సంజయ్, ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, ఈవోఆర్డీ కె.వి.ఎస్.ఎస్.కుమార్, స్థానిక సర్పంచ్‌లు కోరాడ లక్ష్మణరావు, మామిడి ఆరంజ్యోతి పాల్గొన్నారు.


భవన నిర్మాణాలపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ నవీన్‌కుమార్

పీఎం పాలెం: భవన నిర్మాణంలో అవసరమైన సాంకేతిక ప్రమాణాలు పాటించకపోతే తక్కువ వ్యవధిలోనే మరమ్మతులకు గురయ్యే అవకాశముందని ఆర్‌వీఎస్ గ్లోబల్ టెక్నాలజీ సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ కె.వి.నవీన్‌కుమార్ అన్నారు. స్థానిక బాబా ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం ×భవన నిర్మాణం–నీటి లీకేజీ సమస్యలు℠ అనే అంశంపై మూడు రోజుల వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు భవన నిర్మాణాలపై అవగాహన కల్పించారు. భవన నిర్మాణానికి వినియోగించే స్టీల్ సాంద్రత, కాంక్రీట్ సామర్థ్యం, తుప్పు పడితే తొలగింపు, వంటి అంశాలను వివరించారు. ఎక్కువ కాలం భవనం చెక్కు చెదరకుండా ఉండేందుకు అమలు చేసే సాంకేతిక ప్రమాణాలను తెలియజేశారు. కళాశాల కరస్పాండెంట్ కె.శ్రీలక్ష్మి మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు వర్క్‌షాప్‌లో నేర్చుకున్న అంశాలు ఎంతో ఉపకరిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బి.పూర్ణ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా సివిల్ ఇంజినీర్లకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తక్షణం పరిష్కరించాలి



జోన్–2 కమిషనర్ సింహాచలాన్ని సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న కాలనీ నాయకులు



జెడ్పీ ప్రేమ ప్రసన్నవాణికి వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

మధురవాడ: అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా.. ప్రయోజనం లేకపోతోందని, సమస్యలు తక్షణమే పరిష్కరించాలని 8వ వార్డు షిప్‌యార్డ్ లేఅవుట్‌లోని బింద్రానగర్ వాసులు కోరారు. మధురవాడ జీవీఎంసీ జోన్–2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజల నుంచి జెడ్సీ సింహాచలం వినతులు స్వీకరించారు. బింద్రానగర్ కాలనీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుడు ఈటి శేషగిరిరావు ఆధ్వర్యంలో పలువురు మాట్లాడుతూ బింద్రానగర్, ధర్మపురి కాలనీ పరిసర ప్రాంతాలకు చెందిన మురుగు నీరు పిలకపాలెం పెద్ద గెడ్డ ద్వారా కిందికి పారేందుకు కాలువ నిర్మించాలని కోరారు. హైవే నుంచి నగరం పాలెం వెళ్లే మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయాలని, చంద్రంపాలెం హైస్కూల్ వద్ద హైవేపై ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఐ నాయకులు సత్యనారాయణ తదితరులు విజ్ఞప్తి చేశారు. తారకరామా నగర్, కాళిదాసు లే అవుట్‌ల్లో కాలువలు నిర్మాణం, తారాకరామా నగర్‌లో వీధి లైట్లు ఏర్పాటు చేయాలని ఎ.లోవబాబు వినతి పత్రం ఇచ్చారు. జోన్‌లోని వివిధ వార్డుల పరిధిలో 12 అర్జీలు అందాయి. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ సింహాచలం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శివకుమార్, టీపీవో వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'పీజీఆర్ఎస్'కు 11 వినతులు

భీమునిపట్నం: భీమిలి జీవీఎంసీ జోన్–1 కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 11 వినతులు అందాయి. సీపీఐ నాయకులు తగరపువలసకు సంబంధించిన సమస్యలపై వినతిపత్రాన్ని అందించారు. ఇక్కడ ఇంకా రైతుబజారును ప్రారంభించలేదని, ప్రైవేటు మార్కెట్‌లో నిత్యావసర సరకులు, కాయగూరలు, పండ్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, దీన్ని నియంత్రించాలని, మరికొన్ని సమస్యలను పరిష్కరించాలని జెడ్సీని కోరారు. ఇంజినీరింగ్ విభాగానికి 9, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున వినతులు వచ్చాయి. ఈ వినతులను పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు. 30టివిఎల్07: భీమిలి జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణికి వినతిపత్రం అందిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు రామునాయుడు

జెడ్సీ దృష్టికి పలు సమస్యలు

తగరపువలస: భీమిలి జెడ్సీ పి.ప్రేమ ప్రసన్నవాణికి ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో భాగంగా పలువురు వినతిపత్రాలు అందించారు. ఒకటో వార్డు బంగ్లామెట్టపై నుంచి సర్వీస్ రోడ్డు పైకి బండరాళ్లు, గ్రావెల్ జారిపడుతున్నందున ఇక్కడ రక్షణ గోడ నిర్మించాలని పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కరమాని రామునాయుడు, తమ్మిన కూర్మారావు వినతిపత్రం అందించారు. రెండో వార్డు రజక వలందపేటలో సీసీ రోడ్డుపై అడ్డంగా నిర్మించిన దిమ్మె స్థానికులకు ఇబ్బందికరంగా ఉందని, వెంటనే టౌన్ ప్లానింగ్ సిబ్బంది సాయంతో తొలగించాలని మాజీ సైనికుడు కందివలస దుర్గారావు వినతిపత్రం అందజేశారు. భీమిలి జోన్‌లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భీమిలి డివిజన్ సీపీఐ తరపున కానూరి రాంబాబు తదితరులు వినతిపత్రం అందించారు. గోస్తనీనది తీరంలోని శ్మశానవాటికలో వసతులు కల్పించాలన్నారు. చావులమదుం రోడ్డును విస్తరించి మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. చిట్టివలసలో ప్రారంభించిన రైతుబజారులో వెంటనే రైతు కుటుంబాలతో విక్రయాలు ప్రారంభించి వినియోగదారులకు కూరగాయలు, ఆకుకూరలు అందుబాటులో ఉంచాలని కోరారు.